## కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మేకల నగేశ్

**నిజాంపేట్:** నిజాంపేట్‌లోని శ్రీఎల్లమ్మ, నాగదేవత ఆలయంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆలయ చైర్మన్ మేకల నగేశ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

## విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యార్థులకు షూ వేస్తున్న సతీశ్ సాగర్

**కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి, సంకల్ప ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పీ సతీశ్ సాగర్ తన పుట్టిన రోజు సందర్భంగా కొంపల్లి దూలపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్, బ్యాగులు, షూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ రాజిరెడ్డి, శివాజీ రాజు, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఐఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం



అర్యన్‌రోషన్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం

**జీడిమెట్ల:** సిద్దిపేట జిల్లాకు చెందిన అర్యన్‌రోషన్ తండ్రి 12 ఏళ్ల క్రితం మృతిచెందాడు. కాగా అర్యన్ మిత్రుల సహకారంతో చదివి తిరుపతి ఐఐటీలో సీటు సాధించాడు. అయితే విద్యార్థిది నిరుపేద కుటుంబం కావడంతో హార్ట్ టూ హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మూడె రవినాయక్ సీనియర్ అకౌంట్ ఆఫీసర్ స్వరూపిణి, విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ పెరుమాళ్ల వెంకటలక్ష్మి సహకారంతో రూ.10 వేలను మంగళవారం అర్యన్ రోషన్‌కు అందజేశారు.

## లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**చింతల్:** నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద ప్రజలకు భోజనం అందిస్తున్నామని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సురేశ్ కుమార్ తెలిపారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల వద్ద మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్న తమ ఆర్గనైజేషన్ మంగళవారం నుంచి నిమ్స్ ఆస్పత్రి వద్ద కూడా భోజన పంపిణీని ప్రారంభించామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి నగరానికి వైద్యం కోసం వచ్చే రోగుల కుటుంబాలు భోజనాలకు డబ్బులు వెచ్చించలేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారి కోసం భోజన కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రతిరోజు 200 మందికి భోజనం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

**కేపీహెచ్‌బీకాలనీ:** ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనగా ఒకరు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన మున్నంగి మధుసూదన్ పవన్‌కుమార్ రెడ్డి (26) కేపీహెచ్‌బీ కాలనీలోని హాస్టల్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో శ్రీలా పార్కు రోడ్డు నుంచి గోకుల్ ఫ్లాట్స్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో గోకుల్ ఫ్లాట్స్ నుంచి శ్రీలా పార్కు వైపు ఎదురుగా వస్తున్న మరో గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు అతి వేగంగా వచ్చి పవన్ కుమార్ రెడ్డి వాహనాన్ని ఢీకొట్టి పారిపోయాడు. తీవ్రగాయాలైన పవన్‌కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లగచర్ల ఘటనతో ప్రభుత్వం పతనం

- బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు
- అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు



జగద్గిరిగుట్టలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ జగన్

**కుత్బుల్లాపూర్:** లగచర్ల ఘటనతో ప్రభుత్వ పతనం ఆరంభం అయ్యిందని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. లగచర్ల రైతులపై సర్కారు నిరంకుశంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం నిరసనలు చేపట్టారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ పిలుపు మేరకు దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్, గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలోని అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల భూములను బలవంతంగా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని, దీనిపై నిరసన తెలిపిన రైతులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడంతో పాటు పలువురు రైతులకు బేడీలు వేసి జైలుకు పంపించడం అన్యాయన్నారు. ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలను వీడాలని లేకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వారు హెచ్చరించారు.



సూరారంలో కార్పొరేటర్ సత్యనారాయణ..



ప్రగతినగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు..

## ప్రభుత్వ స్థలం పరిరక్షణకు చర్యలు



ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు

**కుత్బుల్లాపూర్:** జీడిమెట్ల సమీపంలోని సరోజినీ గార్డెన్ సమీప ప్రాంతంలో ప్రభుత్వ (యూఎల్‌పీ) అర్బన్ ల్యాండ్ సీలింగ్ స్థలం పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో నిర్మాణాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులకు, పేట్‌బషీరాబాద్ పోలీసులకు మంగళవారం సమాచారం రావడంతో వారు అక్కడికి చేరుకుని పనులు నిలిపి వేయించారు. అయితే సదరు స్థలంలో ఇప్పటికే బోరు వేయగా, తాజాగా పనులు ప్రారంభం కావడంతో తహసీల్దార్ రెహమాన్ ఆదేశాలతో ఆర్ఐ విజయ్, పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతి పత్రాలను పరిశీలించారు. ఇక్కడ గజం విలువ రూ.2 లక్షలకు పైగానే ఉంది. సుమారు రూ. 100 కోట్ల విలువచేసే ఈ స్థలం కబ్జా చేసేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు ఆదిలోనే అడ్డుకుని ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టారు. ఈ స్థలం యూఎల్‌సీ స్థలం అంటూ పలువురు ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు, అలాగే అనుమతులు రద్దు చేయాలని జీహెచ్‌ఎంసీకి సైతం ఫిర్యాదు చేశారు. అయితే సదరు నిర్మాణదారుడు కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

## ముమ్మరంగా సమగ్ర సర్వే డేటా ఎంట్రీ



ఆన్‌లైన్‌లో వివరాల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో ఆన్‌లైన్‌లో సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ముమ్మరంగా సాగుతున్నది. ఇంటింటికీ తిరుగుతూ సేకరించిన వివరాలను జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి ప్రత్యేక సిబ్బందితో నమోదు చేయిస్తున్నారు. ఇప్పటివరకు గాజులరామారం సర్కిల్‌లో 60 శాతం, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 55 శాతం పూర్తయ్యిందని, మరో 3 రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామని వారు తెలిపారు.

## ఆటో ఢీకొని వ్యక్తి మృతి

**జీడిమెట్ల:** రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై మృతిచెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన చంద్రమౌళి (60) మంగళవారం ఉదయం 5 గంటలకు వాకింగ్‌కోసం బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చింతల్‌బస్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా చింతల్ నుంచి షాపూర్‌వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రమౌళి తలకు తీవ్రగాయాలయ్యాయి విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు వెంటనే షాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కుమారుడు రవితేజ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆటో డ్రైవర్ నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భవనం పై నుంచి పడి కార్మికుడు..

**కుత్బుల్లాపూర్:** నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్ షిండే సోమవారం ఉదయం 6.30 గంటలకు పేట్‌బషీరాబాద్‌లోని హర్ష ఆస్పత్రి వెనుక గల్లీలోని ఓ భవనంలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారిపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే కార్మికుడిని హర్ష ఆస్పత్రిలో చేర్పించగా అదేరోజు రాత్రి మృతి చెందాడు. భవన యజమాని, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తన భర్త చనిపోయాడని భార్య నమ్రత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుడిపై వీధి కుక్క దాడి



**సుభాష్‌నగర్:** ట్యూషన్‌కి వెళ్లి వస్తుండగా బాలుడుపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన కొంపల్లి మున్సిపల్ పరిధి దూలపల్లిలో జరిగింది. దూలపల్లి నక్షత్ర ఎన్‌క్లేవ్ చెందిన మలిగే సుధాకర్ కుమారుడు మలిగే ధన్విన్ (10) సోమవారం రాత్రి 7 గంటలకు ట్యూషన్‌కి వెళ్లి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వీధి కుక్క దాడి చేసి కాళ్లు, చేతులకు తీవ్రంగా గాయపర్చింది. వెంటనే బాలుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి



కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ సత్యనారాయణ

**సుభాష్‌నగర్:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ అన్నారు. దుండిగల్ మున్సిపల్ బహదురపల్లిలోని 13వ వార్డులో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు విషయమై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ స్వగృహ, వినాయకనగర్ (60 గజాలు) లో కొంతకాలంగా క్రైం రేట్ పెరిగిందన్నారు. నిర్మానుష్యమైన ప్రదేశాలు ఉండడం వలన కొంతమంది యువత వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నారని, వాటి నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జనవరి 1న ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## సర్వే సిబ్బందికి సహకారం అందించాలి



రీసోర్స్ పర్సన్లతో సమావేశమైన ఉప కమిషనర్ మల్లారెడ్డి

**కుత్బుల్లాపూర్:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు వచ్చే సిబ్బందికి గాజులరామారం సర్కిల్ రీసోర్స్ పర్సన్ సభ్యులు పూర్తి సహకారం అందించాలని ఉప కమిషనర్ మల్లారెడ్డి సూచించారు. సర్కిల్ కార్యాలయంలో గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్లకు చెందిన రీసోర్స్ పర్సన్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు చేయాల్సిన సూచనలు, గ్రేటర్ హైదరాబాద్ నుంచి వచ్చే ఎంక్వయిరీ సిబ్బందికి సహకరించే విధివిధానాలను వివరించారు. సుమారు 40 వేలకు పైగా దరఖాస్తులు ప్రజా పాలనలో స్వీకరించామని తెలిపారు.

## బస్సు ఎక్కాలంటే.. పరుగెత్తాల్సిందే..!



బస్సు ఎక్కేందుకు పరుగెడుతున్న విద్యార్థులు

**కుత్బుల్లాపూర్ :** కొంపల్లి నుంచి మేడ్చల్, సికింద్రాబాద్‌కు వెళ్లే బస్సులు ఉదయం సాయంత్రం వేళల్లో సరిపడా నడపకపోవడంతో విద్యార్థులు, ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్సు రాగానే దాన్ని ఎక్కేందుకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంపల్లి నుంచి సుచిత్ర వరకు రోడ్డు విస్తరణతో పాటు ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో బస్టాప్‌లు తొలగించడంతో బస్సులు ఎక్కడ నిలుపుతున్నారో అర్థం కానీ పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు రద్దీ ఉన్న సమయంలో అదనంగా బస్సులు నడపాలని కోరుతున్నారు.

## సదస్సులు.. నైపుణ్యాభివృద్ధికి సాధకాలు

**కేపీహెచ్‌బీకాలనీ:** సదస్సులు నైపుణ్య అభివృద్ధికి సాధకాలుగా దోహదపడుతాయని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్, ఐఐటీ గౌహతి సంయుక్త ఆధ్వర్యంలో 'ఆల్గాల్ పరిశోధనలో పురోగతులు' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ సింపోజియం మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ.. జీవ ఇంధ ఉత్పత్తి, గ్లోబల్ కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గింపు వంటి కీలక సమస్యల పరిష్కారానికి ఆల్గాల్ ఒక ఆశాజనకమైన పరిష్కారమన్నారు. మేథోసంపత్తిని, సృజనాత్మక శక్తిని పెంచుకునేందుకు అంతర్జాతీయ సదస్సులు ఉపయోగపడతాయని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, యూసీఈఎస్‌టీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ వెంకట నరసింహా రెడ్డి సింపోజియం ప్రాముఖ్యతను ప్రశంసించారు. సింపోజియం చైర్మన్లుగా ఐఐటీ గౌహతీకి చెందిన ప్రొఫెసర్ కౌస్తుభా మోహంతి, సీఎస్ఐఆర్–ఐఐసీటీ హైదరాబాద్‌కు చెందిన డా. ఎస్. వెంకట మోహన్ వ్యవహరించారు. కన్వీనర్‌గా ప్రొఫెసర్ హిమబిందు, జాయింట్ కన్వీనర్‌గా కారుణ్య యూనివర్సిటీకి చెందిన డా. సత్య సుందర్ మోహంతి సేవలందించారు. 100 మందికి పైగా పీహెచ్‌డీ, మాస్టర్స్ విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనలపై ప్రసంగించారు.

# ప్రజల కోసం పోరాడేది సీపీఐనే



సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్

**జగద్గిరిగుట్ట:** ప్రజా సంక్షేమానికి పాటుపడేది సీపీఐ మాత్రమేనని నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్ అన్నారు. జగద్గిరిగుట్ట శాఖ పార్టీ సభ్యత్వం పునరుద్ధరణ సందర్భంగా శాఖ సభ్యులకు సభ్యత్వ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యదర్శి సహదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా పార్టీలు వారికి నాయకత్వం లేక పెట్టుబడిదారుల కోసం పని చేస్తున్నాయని, కానీ కమ్యూనిస్టులు మాత్రం పేద, మధ్యతరగతి ప్రజల కోసం అనుక్షణం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జానకీరాం, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బాబు, సభ్యులు నగేశ్ చారి, సోమయ్య, సామెల్, రవి, నర్సింహారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సదుపాయం కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

**దుండిగల్:** తమ ప్రాంతానికి ఉన్న రోడ్డును విద్యుత్ శాఖ అధికారులు తొలగించారని, వెంటనే ప్రత్యామ్నాయం చూపించాలని డాలర్‌మెడోస్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో డీఆర్‌కే కళాశాల నుంచి భౌరంపేటకు వెళ్లే దారిలో డాలర్ మెడోస్ వెంచర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అప్పట్లో వెంచర్‌కు వెళ్లేందుకు ప్రభుత్వ స్థలం నుంచి ప్రధాన రోడ్డును వేశారని, ప్రస్తుతం 200కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. అయితే సదరు ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు విద్యుత్‌శాఖకు కేటాయించిందన్నారు. దీంతో ఇప్పటికే అసోసియేషన్ సభ్యులు కోర్టును ఆశ్రయించారన్నారు. ఇప్పటికైనా తమకు ప్రత్యామ్నాయ రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరుతున్నారు.

## బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



పోలింగ్ బూత్ అధ్యక్షులను సత్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి

**దుండిగల్:** బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు మరింత కృషి చేయాలని మేడ్చల్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. భౌరంపేట్‌లో పోలింగ్ బూత్‌ల అధ్యక్షులను మంగళవారం నియమించారు. 39వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా మాధవరెడ్డి, 40వ బూత్ అధ్యక్షుడిగా అవినాష్‌రెడ్డి, 41వ బూత్ అధ్యక్షుడిగా పోలీస్ రణదీప్‌రెడ్డి, 42వ బూత్ అధ్యక్షుడిగా తలారి బాలకృష్ణముదిరాజ్, 43వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా గడిల రవీందర్‌ముదిరాజ్, 44వ బూత్ అధ్యక్షుడిగా నాచారం దశరథ్‌యాదవ్, 45 బూత్ అధ్యక్షుడిగా ఎలిమినేటి కరుణాకర్‌రెడ్డి, 46 బూత్ అధ్యక్షుడిగా గౌటికే శివకుమార్, 47వ బూత్ అధ్యక్షుడిగా అందే అశోక్, 48వ బూత్ అధ్యక్షుడిగా క్యాసారం గణేశ్‌ను నియమించి వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పీసరి కృష్ణారెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నర్సింహాచారి, సీతారాంరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జంగారెడ్డి, సీనియర్ నాయకులు సర్గారి సత్తిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమ్మరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై స్తంభాల తొలగింపు




13న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



రోడ్డుపై తొలగించిన స్తంభాల దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

**కుత్బుల్లాపూర్ :** 'నిర్లక్ష్యం ఎందుకు..స్తంభాలు తొలగించకుండానే రోడ్డు పనులు' అని ఈనెల 13న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. అయితే ఇదే తరహాలోనే వెంకటేశ్వరనగర్ కాలనీలోనూ రోడ్డు పైనే విద్యుత్తు స్తంభాలు ఉన్నాయని వాటిని కూడా తొలగించాలని కాలనీసంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

## ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ యూనియన్ ఎన్నికలు



యూనియన్ సభ్యులతో అధ్యక్షుడు కూన శ్రీశైలంగౌడ్

అధ్యక్షుడిగా కూన శ్రీశైలంగౌడ్ ఏకగ్రీవం

**కుత్బుల్లాపూర్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శివంపేట్ మండలం నవాబ్‌పేట్‌లోని ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీలో మంగళవారం యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన కంపెనీ యాజమాన్యం, ఎంప్లాయీస్‌తో సమావేశమయ్యారు. పరిశ్రమలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు ఏ సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మైసయ్య, సభ్యులు దయాకర్, సుబ్బారావు, లక్ష్మణరావు, వెంకన్న, నర్సయ్య తదితరులు ఉన్నారు.

## ఏడో రోజుకు దీక్షలు

**సాక్షి,సిటీబ్యూరో:** తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. వినూత్నంగా చేపడుతున్న ఆందోళనల్లో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు చాయ్ కప్పులతో నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షలకు టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు తిరుమలేష్, తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా నాయకుడు లక్ష్మయ్య, తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డా. వేణు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ఫణి, దేదిప్య, ఇంద్ర, కృష్ణ, సుధారాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

